క్రైం కథ


# మాస్టర్ ప్లాన్

**సినీ నటి దేవకి ఇల్లు కోలాహలంగా వుంది.**

**ఎక్కడ చూసినా రంగురంగుల తోరణాలతో శోభాయమానంగా వుంది.**

**నియాన్ లైట్ల వెలుగుల జిలుగులతో ఇల్లంతా దేదీప్యమానంగా వుంది.**

**దేవకి చెల్లెళ్లు, వదినలు ఆహుతులను రిసీవ్ చేసుకుంటున్నారు.**



ముందుగా స్టార్ ప్రొడ్యూసర్ భువనమోహనరావుగారు వచ్చేరు. ఆ వెనుక మెగా డైరక్టర్ సురమౌళి వచ్చేడు. పెద్ద పెద్ద స్టార్స్, టెక్నిషియన్స్ ఒక్కొక్కరుగా వచ్చేరు. అందరినీ సాదరంగా ఆహ్వానించారు దేవకి కుటుంబసభ్యులు.

అందరి ఎదురుచూపులు దేవకి గురించే.

ఎన్నడు లేనిది దేవకి ఇంత ఆర్భాటంగా పుట్టినరోజు ఎందుకు జరుపుకుంటోందనేది ఎవరికి అంతుపట్టని విషయం.

''బహుశా తన పెళ్లి గురించి ఎనౌన్స్ చేస్తుంది కావచ్చు'' ఒకరిద్దరు చెవులు కొరుక్కున్నారు.

ఎనిమిది దాటిన తరువాత పార్టీ ఏర్పాటు చేసిన గార్డెన్‌లోకి దేవకి వచ్చింది. ఖరీదైన జరీ వర్క్ చేసిన చీరలో రాయంచలా నడిచి వచ్చింది. మెడలో డైమండ్ నెక్లెస్, డైమండ్ టాప్స్, రవ్వల గాజులతో అప్సరసలా మెరిసిపోతోంది.

ముప్పైదాటిని దేవకి దక్షిణాదిన అగ్రనాయికగా వెలుగొందుతోంది. ఇటీవల తనకంటే చిన్నవాడయిన అసిస్టెంట్ డైరక్టరుతో ప్రేమలో పడిందని ఇండస్ట్రీ అంతా చెవులు కొరుక్కుంటున్నారు.

దేవకి చేతినిండా సినిమాలున్న సమయంలో పెళ్లికి సిద్ధం కావడం కుటుంబసభ్యులకు సుతరామూ ఇష్టం లేదని కూడా వినికిడి. ఎవరి అభిప్రాయాలతో తనకు నిమిత్తం లేనట్లు దేవకి ఆ అసిస్టెంట్ డైరక్టర్‌తో వివాహానికే నిర్ణయం తీసుకుందన్నది తాజా సమాచారం.

నిజానికి దేవకి ఈ పార్టీని అరెంజ్ చేయడంలో అంతరార్థం కూడా అదే. ప్రణయ్‌కు, తనకు వున్న అనుబంధాన్ని అందరికి తెలియజెప్పాలనే ఈ అరెంజ్‌మెంట్స్ అవీ.

పార్టీకి ముందర దేవకికి, మిగిలిన కుటుంబసభ్యులకు మధ్య పెద్ద రాద్ధాంతమే జరిగింది.

''దేవకీ పెళ్లికి నువ్వెందుకు తొందరపడుతున్నావు? నీకింకా ఫ్యూచరుంది. బోలెడన్ని అవకాశాలు నీ చేతిలో వున్నాయి'' గట్టిగానే చెప్పేడు పెద్దన్నయ్య.

''అవునమ్మా అప్పుడే నీ పెళ్లికి ఏమంత తొందర? అన్నయ్య చెప్పినట్లు విను'' నచ్చజెపుతున్నట్లు అంది తల్లి.

వాళ్లిద్దరికే కాదు మిగిలిన వారికి కూడా అదే అభిప్రాయం వున్నట్లు గ్రహించింది దేవకి.

''నాకంటే చిన్నది చెల్లాయికి పెళ్లయి నాలుగేళ్లు దాటింది. ఇంట్లో అందరికి పెళ్లిళ్లు అయ్యాయి. నా పెళ్లికి తొందర పడడం లేదు. ఆలస్యం అయిందనుకుంటున్నా'' అందరిని ఉద్దేశించి అన్నది దేవకి.

''అందరూ వేరు, నువ్వు వేరు'' తీవ్రంగా అన్నాడు చిన్నన్నయ్య.

''కోట్లు సంపాదించినా నేను ఆడదాన్నే. నేనెందుకు వేరుగా ఉంటాననుకుంటున్నారు. అందరిలాగా పెళ్లి చేసుకొని పిల్లాపాపలతో జీవితం పచ్చగా వుండాలని నా కోరిక. ఎవరేం చెప్పినా నేను మనసు మార్చుకునేది లేదు.'' మొండిగా అంది దేవకి.

దేవకి న్యాయమైన కోరికకి అందరూ కాస్సేపు మాట్లాడలేకపోయారు.

దేవకి తల్లి కళ్లు చెమర్చాయి.

ఎందుకు దేవకిని అంతలా హింసిస్తారు. తన ఇష్టప్రకారమే కానివ్వండి'' తల్లి మనసు కూతురి ఆవేదనని గ్రహించింది.

''పోనీ ఓ నాలుగేళ్ల తరువాత పెళ్లి గురించి ఆలోచిస్తే'' నసుగుతూ అంది దేవకి

చిన్న చెల్లెలు.

"అప్పుడు నేను చేసుకుందామనుకున్నా నన్నె వరూ చేసుకోరు." కోపంగా అన్నది దేవకి.

"అవన్నీ పక్కకు పెట్టు దేవకీ. నువ్వా కోట్లు సంపాదించావు. నిన్ను కట్టుకోబోయేవాడు నీ డబ్బుని ఆశించి వస్తే రేపటిరోజున నీ గతేం కాను? మనం ఎన్ని కేసులు చూడడం లేదు. డబ్బున్న స్త్రీకి చేరువయ్యి పెళ్లి చేసుకొని ఆమె జీవితాన్ని నాశనం చేసిన ఉదంతాలు ఎన్ని లేవు? రేపు నువ్వు చేసుకో బోయే అతను కూడా నిన్ను వంచిస్తే నీ పరిస్థితి ఏమిటి?" సానునయంగా చెప్పాడు దేవకి తండ్రి.

"అలాగని అసలు వివాహమే వద్దంటే ఎలా? ఏదో ఒక పరిష్కార మార్గం ఆలోచించాలి గానీ" దేవకిని సమర్థిస్తూ అన్నది తల్లి.

అలా అనేక తర్జనభర్జనల అనంతరం దేవకి తన ప్రేమ గురించి ఆ పార్టీలో వెల్లడి చేయడానికి ఏకా భిప్రాయం కుదిరింది.

అందరూ ఊహించినట్లుగానే దేవకి పార్టీలో తనకు, ప్రణయ్‌కు మధ్యన వున్న ప్రేమను వెల్లడి చేసింది.

***

"హైదరాబాద్‌లో రెండు పెద్ద బంగళాలు, చెన్నయి, బెంగుళూర్లో కూడా ఇళ్లు, ముంబైలో ఖరీ దైన, విశాలమైన ఫ్లాట్, నాలుగు ఫాంహౌజ్‌లు, ద్రాక్షతోటలు, ఆంధ్రా ఏరియాలో సారవంతమైన యాభై ఎకరాల మాగాణి, కొబ్బరితోటలు, కోట్ల విలువ చేసే షేర్లు, డిపాజిట్లు ఇవిగాక పదికోట్ల క్యాష్, నాలుగుకోట్ల జ్యూయలరీ,, అరడజను ఖరీ దైన కార్లు ఇవీ ఇంతవరకూ నేను సేకరించిన దేవకి తాలుకూ ఆస్తులు" సిగరెట్ పొగ రింగు రింగులుగా వదులుతూ ప్రేయసికి చెప్పాడు ప్రణయ్.

"అబ్బో చాలా వివరాలు తెలుసుకున్నావే" ఒడిలో వున్న ప్రణయ్ క్రాఫ్‌లో వేళ్లు పోనిచ్చి సర దాగా ఆడుకుంటూ అంది శ్రీలత.

"ప్రణయ్ అంటే ఏమనుకుంటున్నావు? ఆఫ్టాల్ ఒక అసిస్టెంట్ డైరక్టర్ని ఒక టాప్ హీరోయిన్ని ట్రాప్ చెయ్యగలిగానంటే అక్కడే తెలుస్తోంది నా సత్తా" గర్వంగా అన్నాడు ప్రణయ్.

"ఇంతవరకు బాగానే వుంది. పెళ్లయ్యాక మీ ఆవిడకు నీ విషయం తెలిస్తే ఏం చేస్తావు? తీరా తన ఆస్తి మీద గానీ, సంపాదన మీద గాని నీకు ఏ హక్కులు లేవు అంటూ నిన్ను ఇంటి పనికి మాత్రమే పరిమితం చేస్తే ఏం చేస్తావు?" కవ్వింపుగా అంది శ్రీలత.

"నా విషయం దేవకికి తెలిసే ఛాన్సే లేదు. తనకు తెర మీద మాత్రమే నటించడం తెలుసు. మరి నేను, జీవితంలోనే అలవోకగా నటించెయ్యగ లను. ఇక ఆస్తుల విషయం అంటావా? పెళ్లయిన మరుక్షణం దేవకి ఆస్తులన్నింటికి లీగల్ హెయిర్ నేనే. ఎవరికీ అనుమానం రాకుండా మంచి అవ కాశం చూసుకొని దేవకిని పైకి పంపేస్తా. ఆస్తులను స్వంతం చేసుకుంటా" క్రూరంగా చూస్తూ చెప్పాడు ప్రణయ్.

"ప్లాను బాగానే వుంది కానీ జాగ్రత్త ఏమాత్రం క్లూ దొరికినా ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది." హెచ్చరింపుగా అంది శ్రీలత.

"ఎవరికీ అనుమానం రాకుండా సహజ మరణం అనుకునేట్లు ఎలా చంపాలో ముందే పక డ్బందీగా ప్లాన్ చేశాలే" శ్రీలతను చుట్టేస్తూ చెప్పాడు ప్రణయ్.

***

"తొందరపడ్డావ్ దేవకి" ఫోన్లో చిన్ననాటి నేస్తం విద్య మాటలకి చిన్నగా నవ్వింది దేవకి.

"నేను సీరియస్‌గా చెపుతుంటే నవ్వేలా వస్తోంది. అతగాడి గురించి పెద్దగా తెలుసుకో కుండానే పెళ్లి దాకా ఎలా రానిచ్చావే?" ఫోన్‌లోనే కొప్పడింది విద్య.

"వాకబు చేసేక ప్రణయ్ గురించి ఏమయినా చెడుగా వినాల్సి వస్తే నేను తట్టుకోలేను విద్యా. నాకు తెలిసి అతను మంచివాడు. అంతకు మించి నాకు అతని వివరాలు అనవసరం. అయినా ముందు మంచిగా వుండి పెళ్లయ్యాక మారితే ఏం చేస్తాం చెప్పు?"

"అలాగని మరీ అంత రిస్కు తీసుకోవడం అవ సరమా?"

"ఏం చెయ్యమంటావు విద్యా. నాకు పిల్లలు కావాలి. పచ్చటి సంసారం కావాలి. నువ్వు చెప్పి నట్లు ప్రణయ్ కాక వేరొకరిని చేసుకుంటే అతడు మాత్రం మంచివాడని నమ్మకం ఏమిటి? నాలాంటి డబ్బున్న స్త్రీకి ఆశపడకుండా నిజాయితీపరుడయిన వ్యక్తి భర్తగా దొరకాలనుకోవడం దాదాపు అసంభవం విద్యా"

"అది సరేలే తల్లీ అంతగా పెళ్లి చేసుకోవాలనుకు న్నప్పుడు ఏ హీరోనో చేసుకోక మరీ అసిస్టెంట్ డైర క్టర్ని ఎంపిక చేసుకున్నావేంటి?"

"ఏం చెయ్యమంటావు? నాతో స్టెప్పులేసిన హీరోలందరికి పెళ్లిళ్లు అయిపోయాయి మరి." ఇద్దరూ కాసేపు సరదాగా నవ్వుకున్నారు.

మరో పక్క దేవకి కుటుంబసభ్యులు దేవకి ఆస్తుల గురించి రెండు మూడు సార్లు రహస్యంగా సమావేశమయ్యారు. దేవకి ఆస్తి పరాయి వ్యక్తి పరం అవుతున్నందుకు వారి బాధ వర్ణనాతీతం.

ప్రణయ్ తన ప్లాన్‌లో తనున్నాడు.

ఎవరి ప్లాన్లతో ప్రమేయం లేనట్టుగా దేవకి, ప్రణ య్‌ల వివాహానికి సుముహూర్తం నిర్ణయించారు దేవకి తల్లిదండ్రులు.

ప్రణయ్‌తో కలిసి బోలెడంత షాపింగ్ చేసింది దేవకి. ఆ ఖర్చుకి కళ్లు తిరిగేయి ప్రణయ్‌కి.

ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరికీ పేరు పేరున ఇన్విటేషన్ పంపించింది దేవకి.

అత్యంత వైభవంగా జరిగింది దేవకి, ప్రణయ్‌ల వివాహం.

పెళ్లయిన తరువాత యూరోప్ వెళ్లారు. కొత్త జంట హనీమూన్‌కని. హనిమూన్ నుంచి వచ్చేక తమకని కొనుక్కున్న కొత్త బంగాళాలోకి కాపురం పెట్టేరు దేవకి, ప్రణయ్‌లు.

ఆర్నెల్లు ఇట్టే గడిచిపోయాయి.

దేవకికే కాదు ఎవరికీ అనుమానం రాకుండా మసలుకుంటున్నాడు ప్రణయ్. ససమయం చూసు కొని దేవకిని అడ్డు తొలగించుకోవాలని ప్రణయ్ ఆలోచన. దేవకిది సహజ మరణం అని అందరూ అనుకునేలా ఓ పథకం రచించేడు ప్రణయ్.

సరయిన సందర్భం కోసం ఎదురు చూస్తు న్నాడు ప్రణయ్.

ఓ మంచిరోజున దేవకి తల్లి కాబోతున్నట్లు శుభ వార్త తెలిసింది.

దేవకి ఆనందానికి అంతులేదు. దేవకి తల్లిదండ్రులు కూడా ఎంతగానో సంతోషించారు. దేవకి అన్నలూ, చెల్లెళ్లు ముఖాలు మాడ్చుకున్నారు.

ప్రణయ్ గుండెల్లో రాయిపడింది.

"ఇదేమిటి? దేవకి అడ్డు తొలగించుకోవాలని తాను అనుకుంటుంటే ఇలా జరిగింది? రేపొ బిడ్డ గనక భూమ్మీద పడితే ఆస్తిలో వాటాలు పంచాల్సి వస్తుంది.. ఇహ ఆలస్యం చేయకూడదు" గట్టిగా నిర్ణయించుకున్నాడు ప్రణయ్.

అతన్నే గమనిస్తున్న దేవకి చిన్నగా నవ్వుకుంది ఎందుకనో.

***

"ఏమిటి దేవకి ఇలా జరిగింది? నువ్వోసారి మీ నాన్నగారితో మాట్లాడితే బాగుంటుందేమో" పెదాలు తడారిపోతుంటే చిన్నగా అన్నాడు ప్రణయ్.

ఎందుకనో సర్వస్వం కోల్పోయినట్లున్నాడు మనిషి. కోలుకోని దెబ్బతిన్నట్టుగా వుంది ప్రణయ్ వాలకం. ఊహించని ఎదురు దెబ్బకు మనిషి పూర్తిగా కుదేలయ్యాడు ప్రణయ్.

దేవకి ఆస్తులన్నీ తన స్వార్జితమేనని వాటి మీద దేవకికి ఎలాంటి అధికారం లేదని కోర్టులో కేసు వేసేడు దేవకి తండ్రి. అంతే కాదు తేలేవరకూ దేవకి ఆస్తుల మీద ఎలాంటి లావాదేవీలు జరపడానికి వీల్లేదని మధ్యంతర ఉత్తర్వు కూడా తెచ్చుకున్నాడు.

ప్రణయ్ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్ట య్యింది.

"కోర్టు కేసు ఇప్పటిలో తేలదు. కనీసం పది పది హేనేళ్లు పట్టొచ్చు. అప్పటిదాకా దేవకి ఆస్తులను ముట్టుకోవడానికి వీల్లేదు. కేసు తమకు వ్యతిరే కంగా డిసైడ్ అయితే ఆస్తులను మర్చిపోవల సిందే!"

కుడితిలో పడ్డ ఎలకలా వున్న ప్రణయ్ వాలకం చూసి గుంభనగా నవ్వుకుంది దేవకి. ఈ ఆస్తుల గొడవ ఇప్పటిలో తేలదు. మరో ఇరవై ఏళ్లు ప్రణయ్ భార్యాబిడ్డల సేవ చేసి తరించి వార్ధక్యంతో కృశించేకా అప్పుడు తన దగ్గరున్న ఆధారాలను బయటపెట్టి తన ఆస్తులను తను దక్కించు కుంటుంది. అప్పటి వరకు ప్రణయ్, తనకూ, తన కడుపులో వున్న బిడ్డకూ సేవ చేసి తరించే భాగ్యమే దక్కుతుంది.

"ప్రణయ్, నాకు నటించడమే కాదు జీవితంలో నటించే వారి గురించి కూడా తెలుసు. ముఖం చూసి ఎవ రెలాంటి వారో చెప్పగలను. ఎంత మందిని చూసి వుంటాను నీలాంటి వంచకులను ఇప్పటి వరకూ. నిన్ను చేసుకుందామని నిర్ణయించు కున్న రోజే ఈ పథకాన్ని సిద్ధం చేసుకున్నాను. అన్నీ తెలిసి నిన్నే ఎందుకు చేసుకున్నానంటే "ఏ నోన్ డెవిల్ ఈజ్ బెటర్ దేన్ ఏనీ అన్‌నోన్ ఏంజిల్" అని తెలుసు కాబట్టి.

**- పులిపాక కనకదుర్గ**